'హరితహారం'పై గొడ్డలివేటు

- ఇష్టారీతిన నరికివేస్తున్న సెస్ సిబ్బంది
- మాయమవుతున్న ఆకుపచ్చని చెట్లు
- రోడ్డుపై పడేయడంతో వాహనదారులకు ఇబ్బందులు

వరదవెల్లిలో ఇష్టారీతిన నరికివేయడంతో రహదారిపై పడిపోయిన ఆకుపచ్చని చెట్టు

బోయినపల్లి, మే 29: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఖాళీ ప్రదేశాలు, పొలం గట్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటింది. వాటిని కంటికిరెప్పలా కాపాడడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అయితే సెస్ అధికారుల గొడ్డలివేటుకు ఆకుపచ్చని చెట్లు నేలకొరుగుతున్నాయి. విద్యుత్ తీగల కింద ఉన్నాయనే సాకుతో ఏపుగా పెరిగిన చెట్లను విద్యుత్‌శాఖ అధికారులు ఇష్టారీతిన నరికివేస్తున్నారు. ఈ క్రమంలో వరదవెల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో వారం క్రితం చెట్లను కొట్టి రోడ్డుపై వేశారు. అయితే కొట్టిన చెట్లు, కొమ్మలను రోడ్డుపై నుంచి తొలగించక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు చెట్లను కాపాడాల్సిన అధికారులు మాత్రం తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

'హరిత' చెట్లు కొట్టేయడంలేదు

హరితహారంలో భాగంగా నాటిని చెట్లను నరికివేయవద్దని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలిచ్చాం. పూర్తిగా విద్యుత్ తీగల కింద చెట్లు ఉంటే వాటిని కొట్టేందుకు ఎంపీడీవో ఆఫీస్‌లో అనుమతి కోసం లేఖ ఇచ్చాం. సంబంధిత గ్రామ పంచాయతీలకు సమచారం ఇస్తున్నాం. కాని ఇప్పటి వరకు ఏ గ్రామంలో కూడా హరితహారం చెట్లను నరికివేయలేదు. వినియోగదారులను నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నాం. అలాగే వారికి ఎలాంటి ప్రాణ పాయం కలించవద్దనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

– ప్రశాంత్, సెస్ ఏఈ (బోయినపల్లి)

తలాపున ఉన్నా.. తండ్లాటే

- ఇసుక కొరతతో ముందుకు సాగని పనులు
- అనుమతి కోసం తిరిగితే.. పట్టించుకోని అధికారులు

బీఆర్ఎస్ ప్రభుత్వం సామాన్యులకు అందుబాటులో ఉండేవిధంగా గతంలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. ఇల్లు కట్టుకునేవారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూసింది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మూడు నెలల నుంచి ఇసుక కొరత ఏర్పడింది. దీంతో భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఇసుక పర్మిషన్ కోసం భవన యజమానులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తలాపునే ఇసుక ఉన్నా.. తమకు ఈ తండ్లాట.. ఏంటో అంటూ వారు ఆవేదన చెందుతున్నారు.

– కోనరావుపేట, మే 29

కోనరావుపేటలో ఇసుక లేక నిర్మాణం ఆగిపోయిన ఇల్లు

నూతన భవనం నిర్మించుకోవడానికి మార్కెట్‌లో అన్ని రకాల సామగ్రి దొరికినా.. ఇసుక లేక యజమానులు అవస్థలు పడుతున్నారు. కోనరావుపేట మండల కేంద్రంతోపాటు శివంగాళపల్లి, ఏగ్లాస్‌పూర్ గ్రామాలకు గతంలో వెంకట్రావుపేట, నిజామాబాద్ గ్రామాలను ఆనుకొని ఉన్న మూలవాగు నుంచి వారానికి రెండు సార్లు ఇసుక అనుమతి ఇచ్చేవారు. దీంతో ట్రాక్టర్ యజమానులు ప్రభుత్వానికి డీడీ రూపంలో ట్రిప్పునకు రూ.300 చెల్లించి అనుమతి పొందేవారు. ఈ క్రమంలో కొరత లేకుండా ఇండ్లు నిర్మించుకునేవారికి ఇసుక తరలించేవారు. దీంతో ఇబ్బందులు లేకుండా భవన నిర్మాణాలు వేగంగా సాగేవి. అయితే వెంకట్రావుపేట మూలవాగులో ఇసుక రీచ్ వద్ద భూగర్భజలాలు అడుగంటిపోయి బావులు, బోర్లు ఎండిపోతున్నాయని అక్కడి రైతులు ఇసుక తీయడాన్ని అడ్డుకున్నారు. అప్పటి నుంచి అధికారులు ఇసుక అనుమతి ఇవ్వకపోవడం, మరో చోట రీచ్ ఏర్పాటు చేయకపోవడంతో కొరత తలెత్తింది. దీంతో తహసీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని భవన నిర్మాణ యజమానులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరో చోట ఇసుక రీచ్ ఏర్పాటు చేసి నిర్మాణ పనులు సాగేలా చూడాలని వారు కోరుతున్నారు.

పునాదిలోనే నిలిచిపోయింది..

నాకు ఇల్లు లేదు. గతేడాది ఇల్లు కట్టుకుందామని పనులు ప్రారంభించిన. పునాదుల వరకు పనులైనయి. మూడు నెలల నుంచి ఇసుక లేక పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయినయ్. ఇసుక పర్మిషన్ కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగిన. అధికారులెవరూ మమ్మల్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఇసుక రీచ్ ఏర్పాటు చేసి ఇసుక కొరత తీర్చాలి.

– నేరెళ్ల లింబయ్య (కోనరావుపేట)

ఇసుక కోసం అనుమతి ఇస్తున్నాం

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు ఇసుక కొరత లేకుండా రీచ్‌కు అనుమతులు ఇస్తున్నాం. కానీ రీచ్‌లను రైతులు అడ్డుకుంటున్నారు. కోనరావుపేట గ్రామస్తులకు వెంకట్రావుపేట మూలవాగులో ఇసుక అనుమతి ఇచ్చాం. అక్కడి రైతులు అడ్డుకోవడంతో అధికారులను పంపించి ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరిస్తున్నాం. మండలంలో ఎక్కడ కూడా ఇసుక కొరత లేదు. సమస్య మా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం చూపుతున్నాం.

– విజయప్రకాశ్‌రావు, తహసీల్దార్ (కోనరావుపేట)

మల్లేశం సంతాప సభకు తరలి రావాలి

వేములవాడలో బీడీ కార్మికులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు రాములు, అనసూర్య

వేములవాడ, మే 29 : జూన్ 3న నిర్వహించే సీపీఐ సీనియర్ నాయకుడు సామల మల్లేశం సంతాప సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని సీపీఐ నాయకుడు కడారి రాములు, బీడీ కార్మిక సంఘం నాయకురాలు కేవీ అనసూర్య కోరారు. బుధవారం వేములవాడ పట్టణంలోని పలు బీడీ కార్మికులతో వారు సమావేశమై మాట్లాడారు. బీడీ కార్మికుల సమస్యల కోసం 30 ఏళ్లుగా మల్లేశం పోరాటం చేశారని ఆయనను స్మరించుకోవాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. వేములవాడలో నిర్వహించే ఆయన సంతాప సభకు సీపీఐ రాష్ట్ర జాతీయ నాయకులు హాజరవుతున్నందున కార్మికులు తరలి రావాలని కోరారు.

జిల్లా మున్నూరు కాపు కార్యవర్గం ఎన్నిక

వేములవాడ, మే 29 : వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో బుధవారం జిల్లాలోని 13 మండలాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో జిల్లా మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య తెలిపారు. ఇందులో ఉపాధ్యక్షులుగా దుమాల శ్రీనివాస్, నామాల పోశెట్టి, ఉడుతల వెంకటేశం, కోశాధికారిగా తడుక దేవరాజ్, సంయుక్త కార్యదర్శులుగా మెంగాని మహేందర్, ఎర్రం మల్లయ్య, చిందం రమేశ్, నిర్వహణ కార్యదర్శులుగా భూస రాజు, ల్యాగల బాగయ్య, వేల్పుల తిరుపతి, ప్రచార కార్యదర్శులుగా అయిలి శ్రీనివాస్, బండారి బాల్‌రెడ్డి, సందనాల శ్రీనివాస్, అవారి రమేశ్, కార్యవర్గ సభ్యులుగా వరి బాపురెడ్డి, అల్లం లక్ష్మణ్, కాసర్ల దేవేందర్, చెలుకల గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య తదితరులు ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- అర్బన్ బ్యాంకుకు చివరి రోజు 55 నామినేషన్లు దాఖలు

డైరెక్టర్ స్థానాలకు నామినేసన్లు దాఖలు చేస్తున్న రాపెల్లి లక్ష్మీనారాయణ, పత్తిపాక సురేశ్

రాజన్న సిరిసిల్ల, మే 29 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకులో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. చివరి రోజైన బుధవారం ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. 12 డివిజన్లలో డైరెక్టర్ స్థానాలకు 55 నామినేషన్లు దాఖలు కాగా, మూడు రోజుల్లో మొత్తం 105 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో నేడు నామినేషన్ల పరిశీలన, రేపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. జూన్ 6న పోలింగ్‌కు పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కన గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు.

కోడెను అమ్మిన పూజారులపై చర్యలు తీసుకోవాలి

చందుర్తి, మే 29 : నర్సింగాపూర్‌లో శ్రీమోహినికుంట మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు కానుకగా ఇచ్చిన కోడెను మాయం చేసిన ఆలయ పూజారులపై చర్యలు తీసుకోవాలని నర్సింగాపూర్ నాయకులు బుధవారం వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారికి ఫిర్యాదు చేశారు. ఆలయ పూజారి, ఒగ్గు కళాకారులు కలిసి ఆలయ కోడెను ఇతరులకు విక్రయించారని ఈ ఘటనపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ నక్క గంగాధర్, ఆలయకమిటీ సభ్యులు కాసారపు శ్రీనివాస్, పెరుక గంగరాజు, చింతకుంట గంగాధర్, బాపయ్య, ఎల్లారెడ్డి, సాగర్, నరేశ్, ఎల్లారెడ్డి, దశరథం ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడ రూరల్, మే 29: వేములవాడ పట్టణ పరిధిలోని కోనాయపల్లిలోని లక్కామారు మున్నూరు కాపు ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు. ఇక్కడ నాయకులు అంజయ్య, రాజేశం, మల్లయ్య, రాజేశం, మధుతో పాటు సంఘం సభ్యులున్నారు.

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

మామిడిపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

కోనరావుపేట, మే 29: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంటనే అక్కడికి డీటీ జయంత్‌కుమార్, ఆర్ఐ రాజశేఖర్ రైతులతో చేరుకొని మాట్లాడారు. మూలవాగులో రీచ్‌ను నడిపించేలా రైతులు సహకరించాలని ఆయన కోరారు. అయినప్పటికీ రైతులు వినలేదు. ఇసుక తీస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇసుక రీచ్ ద్వారా ట్రాక్టర్ యజమానులు విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్నారని వాపోయారు. వారానికి రెండు రోజులు ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసి అధికారులు ఇసుకను తరలించడం ద్వారా మూలవాగును ఆనుకొని ఉన్న వ్యవసాయ భూములు పూర్తిగా కోతకు గురై తీవ్రనష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. గత సంవత్సరంలో వరద ఉధృతికి ఎస్సీ కాలనీలో నీరు చొరబడి పూర్తిగా జలమయం అయిందన్నారు. గత సంవత్సరం కోతకు గురైన భూమికి ఇప్పటివరకు నష్ట పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎలాగైనా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తామని తెలుపగా, రైతులు అడ్డుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు పోలీసులను రప్పించి ఇసుక ట్రాక్టర్లను నడిపించే ప్రయత్నం చేయగా ట్రాక్టర్ యజమానులు ముందుకు రాలేదు. చేసేదేమీ లేక అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నియామకం

వేములవాడలో బాలయ్యకు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య, జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య

వేములవాడ, మే 29: రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యుడిగా వేములవాడ పట్టణానికి చెందిన కొయినేని బాలయ్యను నియమిస్తూ నియామక పత్రాన్ని బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అందజేశారు. సంఘం పటిష్టతకు పాటుపడతారని ఈ సందర్భంగా బాలయ్య తెలిపారు. కార్యక్రమంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, ప్రధాన కార్యదర్శి పొంచెట్టి శంకర్, నాయకులు నామాల పోశెట్టి, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, మారం కుమార్, బొందిల మహేశ్ తదితరులున్నారు.

గిరిజన రైతుకు పరామర్శ

కిష్టునాయక్ తండాలో గిరిజన రైతుకు భరోసానిస్తున్న తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట, మే 29: ఇటీవల ఈదురుగాలులతో కిష్టునాయక్ తండాకు చెందిన గిరిజన పౌల్ట్రీ రైతు మాలోత్ హన్మంత్‌నాయక్ షెడ్డు ధ్వంసమై, కోళ్లు మృతి చెందగా రూ.4లక్షల వరకు నష్టపోయాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బుధవారం ఆయనను పరామర్శించారు. జరిగిన నష్టంపై వివరాలు సేకరించారు. సాయం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని భరోసానిచ్చారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్, తదితరులున్నారు.

ముంబైలో గంజాయి నిందితుడి అరెస్ట్

చందుర్తి, మే 29 : చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో పట్టుబడి పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకున్న గంజాయి నిందితుడు రత్న విలాస్‌ను ముంబైలో చండీవాలి ప్రాంతంలో అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్ఐ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన రత్న విలాస్ గంజాయిని విక్రయిస్తూ పట్టుబడి ముంబైకి పారిపోగా బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.

NT-339514-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

91827 77194

'గ్రూప్-1 ప్రిలిమినరీ'కి ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, మే 29 : వచ్చే నెల 9న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం వచ్చే నెల 9వ తేదీన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ మీటింగ్ హాలులో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహజన్, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్‌తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగే గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లాలో 4,699 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే, ప్రత్యేకంగా నెలకొల్పిన కంట్రోల్ రూమ్ 93986 84240 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ముందుగానే చేరుకోవాలని, అలస్యమైన వారిని పరీక్షకు అనుమతించరని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్సీవో శ్రీనివాస్, డీఐఈవో మోహన్, డీఈవో రమేశ్ కుమార్, డీటీవో లక్ష్మణ్, సిరిసిల్ల వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్ పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

సిరిసిల్ల రూరల్, మే 29 : అమ్మ ఆదర్శ పాఠశాలలోని పనులను వేగంగా పూర్తి చేయాలని, జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా వంద శాతం పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల, మండేపల్లిలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా ఆయన పర్యవేక్షించారు. మండలంలోని 29 పాఠశాలల్లో చివరి దరశ పెండింగ్ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. మండేపల్లిలోని భాగ్యలక్ష్మి మహిళా శక్తి టైలరింగ్ సెంటర్‌ను సందర్శించారు. గడువులోగా స్కూల్ యూనిఫామ్స్ అందివ్వాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 41,680 యూనిఫాంలు లక్ష్యంగా కాగా, ఇప్పటివరకు 20,314 పూర్తయ్యాయని పేర్కొన్నారు. జిల్లాలో 38 మహిళా సమాఖ్యల పరిధిలో 536 మంది మహిళలకు ఉపాధి లభిస్తున్నది. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఆర్డీవో శేషాద్రి, డీఈవో రమేశ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ నాగరాజు, డీపీఎం సుధారాణి, ఎంపీడీవో జోగం రాజు, సంబంధిత శాఖాధికారులు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్ : మండేపల్లిలో యూనిఫాంలు కుడుతున్న మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ముస్తాబాద్, మే 29 : అమ్మ ఆదర్శ కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పోతుగల్ చీకోడు గూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పనులను బుధవారం పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గూడెం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే స్కూల్ డ్రెస్‌ను తయారు చేసే శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ అడిషనల్ కలెక్టర్ గౌతమి, డీఆర్డీవో పీడీ శేషాద్రి, డీఈవో రమేశ్, అధికారులున్నారు.

జిల్లాకు 1.76 లక్షల పత్తి విత్తనాలు అవసరం

- కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, మే 29 : జిల్లాలో పత్తి సాగు ఆవశ్యకతను అనుసరించి విత్తనాలను సరఫరా చేయాలని జిల్లాలోని డీలర్లను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ సంచాలకులు విత్తన లభ్యత, సరఫరాపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పత్తి పంటను గత సంవత్సరం 50,552 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 49,215 ఎకరాలు సాగు చేస్తారని అంచనాలు వేసి 1,76,000 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయన్నారు. ఈ విత్తనాలు సరఫరా చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి డీలర్లను ఆదేశించారు. ఈ వానకాలంలో ప్రాథమికంగా పచ్చిరొట్ట అయిన జీలుగ విత్తనాలు 2,250 క్వింటాళ్లు జిల్లాకు కేటాయించినట్లు, గత సంవత్సరంలో 2200 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రైతులకు సరఫరా చేశామని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటికే 1582.20 క్వింటాళ్ల విత్తనాలు ప్రాథమిక వ్యవసాయ సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్‌ల ద్వారా సరఫరా చేశామన్నార. మిగతా 667.80 క్వింటాళ్ల విత్తనాల సరఫరా కోరామని తెలిపారు. ఇప్పటివరకు 48000 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచగా 5670 విత్తన ప్యాకెట్లు రైతులు కొనుగోలు చేశారన్నారు. రైతులు లైసెన్స్ డీలర్ వద్ద మాత్రమే రశీదు పొంది విత్తనాలు కొనాలని కోరారు. జిల్లాలో పత్తి విత్తనాల కొరత లేదని కలెక్టర్ వెల్లడించారు.

మామూళ్లపైనే అధికారుల దృష్టి

- సేవలందించడంలో విఫలం
- పీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం

గంభీరావుపేట, మే 29: 'అధికారులకు మామూళ్లు వసూలు చేయడంపై ఉన్న దృష్టి సేవలందించడంలో లేదు..నాలుగు నెలలుగా ఆర్థిక భారం మోపుతూ పేదలను పట్టిపీడిస్తున్నారు.' అని పీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ఆరోపించారు. బుధవారం గంభీరావుపేట తహసీల్దార్ ఆఫీసు వద్ద విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పెడచెవిన పెట్టి క్వింటాల్‌కు 5 కిలోల కోత పెట్టి రైతుల కష్టాన్ని దోచుకున్నారని విమర్శించారు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కయి అన్నదాతను నిలువునా ముంచారన్నారు. వాహనాల ట్రక్ షీట్ల ఆధారంగా 5 కిలోల చొప్పున తరుగు తీసిన ధాన్యానికి మద్దతు ధర ప్రకారం నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక అవసరాలకు ఇసుకను ఉచితంగా తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, కానీ రెవెన్యూ అధికారులు ట్రాక్టర్ల యాజమానుల దగ్గర మామూళ్లు తీసుకొని ధరలను పెంచారని ఆక్షేపించారు. గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్ ఇసుకకు ధర రూ.4 వేలు వెచ్చించాల్సి వస్తున్నదన్నారు. అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదన్నారు. రైతుల నుంచి క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున రైతుల నుంచి దోచుకున్న ధాన్యం డబ్బులతో పాటు ఇసుక అక్రమ వ్యవహారంపై కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు తగిన ఆధారాలతో సహా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు.

మొక్కలు ఎండిపోవద్దు

వేములవాడ రూరల్, మే 29 : హరితహారం ఏర్పాటుకు నర్సరీలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని, మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పేర్కొన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్, నర్సరీలతోపాటు పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రమేశ్ ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

ఇల్లంతకుంట, మే 29 : మండలంలోని పొత్తూరు గ్రామంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ తనిఖీ చేశారు. ఇక్కడ ఏవో సురేశ్ రెడ్డితోపాటు యజమానులున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సిరిసిల్ల రూరల్, మే 29 : రైతులకు నకిలీ విత్తనాలు కేటాయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నాణ్యమైన విత్తనాలనే అందివ్వాలని తంగళ్లపల్లి వ్యవసాయాధికారి సందీప్ అన్నారు. ఈ మేరకు బుధవారం తంగళ్లపల్లి మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఫర్టిలైజర్ దుకాణాల్లో అన్ని రకాల రికార్డులు, విక్రయ రసీదులను తనిఖీ చేశామన్నారు. రైతు సోదరులకు తప్పనిసరిగా నియమ నిబంధనల ప్రకారం విత్తనాలు, ఎరువులు అమ్మాలని, అమ్మిన బిల్లులు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. ఫర్టిలైజర్ షాపుల్లో రిజిస్టర్, స్టాక్ బోర్డు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఇక్కడ వ్యవసాయ విస్తరణాధికారులు అభిషేక్, వెంకటేశ్, ఫర్టిలైజర్ షాపు యజమానులున్నారు.

ఇల్లంతకుంట, మే 29 : రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఈవో జ్యోతి రెడ్డి, గంగ సూచించారు. మండలంలోని తాళ్లపెల్లి, వంతడుపుల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు.

ఎల్లారెడ్డిపేట, మే 29: నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి భూంరెడ్డి తెలిపారు. పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. డీలర్లు విత్తనాలను లూజ్‌గా అమ్మి తే సమాచారమివ్వాలన్నారు. ఇక్కడ ఏఈవో లక్ష్మణ్, ముకుంద్ ఉన్నారు.

రుద్రంగి, మే 28: వానకాలం విత్తనాల కొనుగోలుపై రుద్రంగి మండలం గైదిగుట్ట తండా, అడ్డబోర్‌తండాల్లోని రైతులకు వ్యవసాయ విస్తరణాధికారి విజయ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ తరపున గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.

భూసారంతోనే మేలైన పంట

సిరిసిల్ల రూరల్, మే 29 : భూసారంతోనే మేలైన పంట సాగవుతుందని ఎరిస్ ఆగ్రో ప్రతినిధులు పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో ఎరిస్ ఆగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ఆధారంగానే రైతులు పంటలకు ఎరువులు, సూక్ష్మ పోషకాలను సరైన పద్ధతిలో, సరైన సమయంలో వాడాలని ఎరిస్ ఆగ్రో డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజు సూచించారు. ఇక్కడ సీనియ ర్ ఆఫీసర్ శ్రీనివాస్, రాజిరెడ్డి, అనిల్, ప్రతాప్‌రెడ్డిలున్నారు.

మరిమడ్లలో చోరీ

కోనరావుపేట, మే 29: మరిమడ్లలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో చింతలపల్లి సుమన్ రాత్రి వేళ ఇంటి ఎదుట నిద్రించాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తులంనర బంగారు ఆభరణాలు, 12 తులాల వెండిగొలుసులు ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే యజమానులు లేచిచూడగా ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురయ్యాయని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు దొంగతనం తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.